సాక్షి

రాజన్న సిరిసిల్ల

శనివారం । 10 । ఆగస్టు । 2024

న్యూస్‌రీల్

పరిశుభ్రతతో ఆరోగ్యం

● ఎస్పీ అఖిల్ మహాజన్



తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఠాణాలోని రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు. దర్యాప్తులో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



పేర్లు నమోదు చేసుకుంటున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో వికలాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని లక్ష్మీమల్లారెడ్డి కన్వెన్షన్‌లో శుక్రవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ శిబిరం ఏర్పాటు చేశారు. త్వరలోనే ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి భాస్కర్, ఎంపీడీవో సత్తయ్య, కార్యదర్శి ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, తిరుపతి, గౌస్, రాంరెడ్డి ఉన్నారు.

12న దివ్యాంగ విద్యార్థులకు క్యాంపు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 12న సిరిసిల్లలోని సినారె కళామందిర్‌లో క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. వైద్యులు పరీక్షించి అవసరమున్న వారికి ఉపకరణాలు అందజేస్తారన్నారు. ఆధార్‌కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ లేని వారు ప్రభుత్వ వైద్యుడు జారీచేసిన సర్టిఫికెట్ తేవాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారు ఈ శిబిరానికి రావాలని కోరారు.

నెమలిని రక్షించిన రైతులు



నెమలిని పరీక్షిస్తున్న అటవీశాఖ అధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని బందనకల్‌లో పంట పొలాల్లో గాయపడ్డ జాతీయపక్షి నెమలిని రైతులు శుక్రవారం గమనించారు. రైతు రామచంద్రంగౌడ్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ ఆఫీసర్ అంజలి సిబ్బందితో బందనకల్‌కు చేరుకుని నెమలికి చికిత్స చేయించిన తర్వాత చిప్పలపల్లి అటవీ ప్రాంతంలో వదిలినట్లు తెలిపారు.

తిరంగా ర్యాలీ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడరూరల్: ఉమ్మడి కరీంనగర్‌లో యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. వేములవాడ రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన వారిని గుర్తుంచుకోవాలన్నారు. 12న అమరుల విగ్రహాల వద్ద శుభ్రపరిచి పుష్పాంజలి ఘటించాలని, 13, 14 తేదీల్లో ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. రవికిశోర్, అనిల్, పరమేశ్, రాజేందర్, వంశీ ఉన్నారు.



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

సిరిసిల్లటౌన్: నాగుల పంచమిని పురస్కరించుకొని శుక్రవారం మహిళలు పుట్టల్లో పాలు పోశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివనగర్, మదేలేశ్వరస్వామి, సత్యసాయిసేవా మందిరం, శ్రీశివసాయిబాబా ఆలయాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి.

దొంగల భయం.. యువకుల గస్తీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. దీంతో స్పందించిన స్థానిక యువత ప్రతీ వీధిలో రాత్రి 10 గంటల తర్వాత గస్తీ తిరుగుతున్నారు.





షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో సినీతారలు సందడి చేశారు. ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. అంతకుముందు చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చలిమెడ లక్ష్మీనరసింహారావు, ప్రముఖ వైద్యుడు సూర్యనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసినమాల్ 32వదని, త్వరలోనే నిజామాబాద్, మేడ్చల్‌లోనూ ప్రారంభిస్తామని సీఎంఆర్ ఎండీ మావురి వెంకటరమణ తెలిపారు. సినీతారలను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. వారితో హీరోయిన్లు సెల్ఫీలు దిగారు. అనంతరం మాల్‌లో పలు వస్త్రాలను పరిశీలించి, హర్షం వ్యక్తం చేశారు.

పాయల్ జోష్.. సంయుక్త సందడి





కార్మిక ఆస్పత్రులపై చిన్నచూపు

- అద్దె భవనాల్లోనే డిస్పెన్సరీలు
- బీడీ కార్మికులకు అందని వైద్యసేవలు
- స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- జిల్లాలో 60వేల మంది బీడీ కార్మికులు
- అరకొర వసతులతో అందని వైద్యం



ముస్తాబాద్‌లో అద్దె భవనంలో బీడీ కార్మిక ఆస్పత్రి



బీడీలు చుడుతున్న కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): బీడీకార్మికుల ఆస్పత్రులపై పాలకులకు చిన్నచూపు ఉంది. ఏళ్లుగా అద్దె భవనాలు.. అరకొర వసతులు.. చాలీచాలని సిబ్బందితోనే కొనసాగుతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 60వేల మంది వరకు మహిళా బీడీకార్మికులు పనిచేస్తున్నారు. బీడీలు చేసే వారందరూ పేద, నిరుపేద మహిళలే. వారు అనారోగ్యానికి గురైతే భారీ మొత్తంలో డబ్బులు వెచ్చించలేరనే ఉద్దేశంతో జిల్లాలో ముస్తాబాద్, సిరిసిల్ల, నాంపెల్లి గ్రామాల్లో కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బీడీ కార్మిక ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. గత 25 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రుల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మూలనపడ్డ అంబులెన్స్ సేవలు

కేంద్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు ఆస్పత్రుల్లో ఐదేళ్ల క్రితం వరకు అంబులెన్స్(మొబైల్ వైద్యసేవలు) ద్వారా వైద్యసేవలు అందించేవారు. సిరిసిల్లలో వాహనం మరమ్మతులకు రావడంతో మూలనపడేశారు. ముస్తాబాద్, దుబ్బాక ఆస్పత్రుల కోసం ఒక వాహనాన్ని కేటాయించగా, అది మరమ్మతులకు గురైంది. ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాల్లో మొబైల్ వైద్యసేవలు అందించాల్సి ఉంది. వాహనాలు లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఆస్పత్రులకే పరిమితమవుతున్నారు. గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించడం లేదు.

ఖాళీలు అనేకం

సిరిసిల్ల, ముస్తాబాద్, నాంపల్లి కేంద్ర కార్మిక ఆస్పత్రుల్లో అన్నీ ఖాళీలే కనిపిస్తున్నాయి. ముస్తాబాద్‌లో స్టాఫ్‌నర్స్, సిరిసిల్లలో ఫార్మసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాంపల్లిలో డిప్యూటేషన్‌పై వైద్యాధికారి పనిచేస్తున్నారు. వార్డుబాయ్ పోస్టులతోపాటు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మూడు ఆస్పత్రులకు కొత్త వాహనాలు అందించాలని కార్మికులు కోరుతున్నారు. పక్క భవనాలను నిర్మించి, కార్మికులకు మెరుగైన ఓపీ సేవలతోపాటు ఇన్‌పేషెంట్ వైద్యసేవలు అందించాలన్న డిమాండ్ ఉంది.

ఆస్పత్రుల్లో ఇతర సేవలు

మూడు ఆస్పత్రుల్లో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను అమలు చేస్తున్నారు. ఇళ్లు లేని కార్మికులకు ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేస్తారు. గతంలో వంద ఇళ్ల వరకు కార్మికశాఖ అధికారులు నిర్మించి ఇచ్చారు. అలాగే బీడీ కార్మికుల పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందిస్తారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.10వేలు, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.25వేలు అందిస్తారు.

రోగాలబారిన బీడీ కార్మికులు

తంబాకుతో బీడీలు చుట్టే కార్మికులు అనేక రోగాలబారిన పడుతున్నారు. క్షయ, దగ్గు, దమ్ము, శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. వీరికి అందించే మందులు(మెడిసన్) చాలా విలువైనవి. కానీ సరైన ప్రచారం, అవగాహన లేక కార్మికులు ఈ ఆస్పత్రులకు రావడం లేదు. సిరిసిల్ల పట్టణంలోనే 40వేల మందికిపైగా బీడీ కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో రోజుకు 60 నుంచి 70 మంది కార్మికులు మాత్రమే ఆస్పత్రికి వస్తున్నారు. పేదకార్మికుల కోసం కేంద్రం ఏర్పాటు చేసిన ఆస్పత్రులపై అవగాహన లేదని కార్మిక నాయకులు అంటున్నారు.

కీళ్లనొప్పులకు మందులు లేవు



నేను ఇరువై ఏళ్లుగా బీడీలు చేస్తున్న. మెడ, కాళ్లు, కీళ్లనొప్పులు వస్తున్నాయి. బొక్కలు నొప్పి లేస్తున్నయి. పిల్లలను సాదుకోవాలంటే బీడీలు చేయకతప్పడం లేదు. ముస్తాబాద్ దవాఖానా డాక్టర్లు అప్పుడప్పుడు క్యాంపు పెట్టి మందులు ఇచ్చేవారు. ఇప్పుడు క్యాంపులు పెడతలేరు.

– రేణుక, ఆవునూర్

దవాఖానా ఉన్నట్టు తెల్వది



మా ఆయన వ్యవసాయం పనులు చేస్తడు. ఇద్దరు పిల్లలను సాదుకునేందుకు నేను బీడీలు చేస్తున్న. ఎప్పుడన్న సుస్తీ అయితే ప్రైవేటు దవాఖాన్లకు పోతున్నం. ముస్తా బాద్‌లో కార్మికుల కోసం దవాఖానా ఉన్నట్టు తెల్వది. సార్లే జర ఊర్లకు వచ్చి చెప్పితే పోయేటోళ్లం. ఖర్చులు తప్పుతుండే.

– రుద్రవరం దీప, మద్దికుంట

అధికారులకు నివేదించాం

డిస్పెన్సరీలలో మొబైల్ వాహనాలు రిపేరులో ఉన్నాయి. ఖాళీ పోస్టులు, ఇతర సౌకర్యాలపై అధికారులకు నివేదించాం. మొబైల్‌వాహనం ఉన్నప్పుడు క్యాంపులు పెట్టాం. కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తాం. బీడీ కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తాం. కేంద్ర ఆస్పత్రులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ విక్రమ్, వైద్యాధికారి

నమిలిగుండుపల్లికి బస్సు వచ్చింది



వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం నమిలిగుండుపల్లికి శుక్రవారం ఆర్టీసీ బస్సు వచ్చింది. ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ ఆ గ్రామానికి ప్రచారం కోసం వెళ్లగా తమ గ్రామానికి బస్సు రాక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే బస్సు వచ్చేలా చూస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సును శుక్రవారం ఊరికి పంపించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

● బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి

సిరిసిల్ల: నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని జిల్లా బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్లా వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బీసీ నిరుద్యోగ యువతకు సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషిన్, డిష్‌వాషర్, ఏసీ రిపేర్, ఇన్‌స్టలేషన్, గ్యాస్‌చార్జింగ్, ఎల్ఈడీ టీవీ మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ ప్యూరీఫయర్, బేసిక్ హోమ్ రిపేరు, అప్లయన్సెస్ ఇన్‌స్టలేషన్ వంటి వాటిల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ కుషాయిగూడా హైదరాబాద్‌లో 100 మందికి శిక్షణ ఇస్తామని వెంకటస్వామి తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున 3 నెలలపాటు స్టైఫండ్‌ను అందించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 93818 88746, 08723-223004 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరేయండి

● బీజేపీ శ్రేణులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



కరీంనగర్ టౌన్ : 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఈనెల 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరేసి దేశ భక్తి చాటిచెప్పాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలు, జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి ప్రతీ ఇంటికి వెళ్లి జాతీయ జెండా ఎగరేసేలా ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. శుక్రవారం ఢిల్లీ నుంచి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ బూత్ కమిటీ మొదలు రాష్ట్రస్థాయి నాయకుడి వరకు దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' లక్ష్యమన్నారు. శనివారం నుంచి పంద్రాగస్టు వరకు ప్రతీ ఒక్కరూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా దేశభక్తుల ఫొటోలు వాట్సప్ డీపీలుగా పెట్టుకోవాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నెలకొల్పిన జాతీయ నేతల విగ్రహాలను శుద్ధిచేయాలన్నారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లో నిర్వహించే ''తిరంగా యాత్ర''లో తాను పాల్గొంటానని తెలిపారు. మరోవైపు పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో 80 శాతానికిపైగా ఓట్లు పోలైన పోలింగ్ బూత్‌ల ఎంపిక పూర్తయ్యిందని, త్వరలో పోలింగ్ బూత్ కమిటీలను సన్మానించడంతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని బండి సంజయ్ తెలిపారు.

రేపు కరీంనగర్‌కు బండి సంజయ్

పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం రాష్ట్రానికి రానున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు పాల్గొంటారు.

అడ్డబోర్‌తండాలో ఎలుగుబంటి సంచారం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలంలోని లద్దబోర్‌తండా పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో శుక్రవారం ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో ఉన్న పంట పొలాల్లో ఎలుగుబంటిని గమనించిన కొందరు రైతులు కర్రలు పట్టుకొని అడవిలోకి తరిమే ప్రయత్నం చేయగా గ్రామంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి అందరూ కలసి అటవీలోకి తరిమివేశారు. ఎలుగుబంటి సంచరిస్తుండడంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

ఏడు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని ఏడు మండలాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. జిల్లా కేంద్రంలో 2.3 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. వేములవాడ రూరల్‌లో 0.6, వేములవాడలో 0.9, ఎల్లారెడ్డిపేటలో 0.3, ముస్తాబాద్‌లో 0.4, తంగళ్లపల్లిలో 1.6, ఇల్లంతకుంటలో 0.3 మిల్లీ మీటర్ల తుంపర జల్లులు పడ్డాయి.

పట్టణాభివృద్ధికి కృషి



పార్క్‌ను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడఅర్బన్: వేములవాడను మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయం సమీపంలోని అంబేడ్కర్ చౌరస్తాను వీటీడీఏ నిధులు రూ.30లక్షలతో తీర్చిదిద్దే పనులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. వేములవాడలోని మురుగునీరు గుడి చెరువులో కలవకుండా మున్సిపల్ నిధులు రూ.3కోట్లతో చేపట్టే పనులకు భూమిపూజ చేశారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు మండల పరిషత్‌లో ఎకరం స్థలంలో వీటీడీఏ నిధులు రూ.2కోట్లతో నిర్మించిన పార్క్‌ను ప్రారంభించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్క్‌లో ఆధునిక టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, స్నాక్స్ కోసం స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాజన్న ఆలయానికి కేటాయించిన రూ.50కోట్లకు సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వేములవాడ మండలం మారుపాకలో స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. డీఎఫ్‌వో బాలమణి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, తహసీల్దార్ మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గొట్టె రాజయ్య–వెంకవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు మనోజ్, మహేశ్ ఉన్నారు. ఇద్దరూ కరీంనగర్‌లో కూలీ పని చేస్తున్నారు. ఈ క్రమంలో మహేశ్ గురువారం రాత్రి కోనరావుపేట వచ్చాడు. అతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకున్నాడు. తల్లి వెంకవ్వ ఉదయం లేచి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజయ్య గతంలోనే చనిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

రుద్రంగిలో ఒకరు..

రుద్రంగి(వేములవాడ): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రుద్రంగి ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఉప్పు సురేశ్(32) కుటుంబ గొడవల కారణంగా గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన స్నేహితుడికి వీడియో కాల్ చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. అతను ఈ విషయాన్ని సురేశ్ తల్లి లక్ష్మికి తెలుపగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, రాత్రి వరకు వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం మళ్లీ వెతకగా స్థానిక శ్రీ బుగ్గ రాజన్న ఆలయ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఐదేళ్ల పాప ఉన్నారు.

ద్విచక్రవాహనం చోరీ


బైక్‌ను ఎత్తుకెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం ప్రైమరీ స్కూల్ వాచ్‌మెన్ గోరేమియాకు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. విధుల్లో ఉన్న గోరేమియా తన ద్విచక్రవాహనాన్ని గేట్ ఎదుట నిలిపి ఉంచాడు. సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరా దృశ్యాల్లో నిక్షిప్తమైంది. వెంటనే ఎస్సై రమాకాంత్‌కు ఫిర్యాదు చేశాడు.

కొవ్వొత్తుల ర్యాలీ


ఎల్లారెడ్డిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. మిరియాల్‌కార్ రవి, దుమాల దేవయ్య, మనోజ్, శివకుమార్, రాజు, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గురుకులంలో ఏం జరుగుతోంది?

- విద్యార్థుల మృతికి కారణాలేంటి?
- ఆరోగ్య సమస్యలా? కలుషిత నీరు, ఆహారమా? పాములా?
- వీడని మిస్టరీ..
- పెద్దాపూర్ పాఠశాలను వీడుతున్న విద్యార్థులు


తరగతి గదుల వెనక పాడుబడ్డ బావి


అధికారులతో పేరెంట్స్ వాగ్వాదం


పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న పేరెంట్స్

కోరుట్ల/మెట్‌పల్లి రూరల్: 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు.. మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు.. ఇంకో 25 మంది అనారోగ్యంతో ఉన్నారు.. కారణం ఆరోగ్య సమస్యలా? కలుషిత నీరు, ఆహారమా? పాములా? అన్నది తెలియడం లేదు. పిల్లల మృతి మిస్టరీ వీడటం లేదు.. మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులంలో ఈ భయానక వాతావరణం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. 40 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాల మంచి పేరు పొందింది. ఇప్పుడు ఇద్దరు విద్యార్థుల మృతితో అప్రతిష్ట మూటగట్టుకుంది. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో విచారణ జరిపితే గానీ.. నిజానిజాలు నిగ్గు తేలే పరిస్థితి కనిపించడం లేదు.

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్కూల్ పరిసరాలు అడవిని తలపి స్తున్నాయి. ఎక్కడచూసినా అపరిశుభ్రతే. తరగతి గదుల వెనక చెట్ల పొదలు, బురద, పాముల పుట్ట లు, గడ్డి, కూలిన పాత తరగతి గదులు, పనికి రాని సామగ్రి, కిచెన్ వెనక భాగంలో పాడుబడ్డ బావి, అందులో దోమలు.. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని సమస్యలు. శుక్రవారం అనిరుధ్ అనే విద్యార్థి మృతిచెందాక అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థుల సంఖ్య 25 మందిగా తేలింది.


పాఠశాల ఆవరణలో పాము

పాములతో సావాసం..

పెద్దాపూర్ గురుకులంలో ఏటా వానాకాలంలో పాములతో సావాసం చేయడం విద్యార్థులకు షరా మామూలుగా మారింది. 15 రోజుల క్రితం గణాధిత్య చనిపోవడానికి కారణం మొదట పాముకాటే అని భావించినా తర్వాత ఫిట్స్ అని వైద్య పరీక్షల్లో తేలింది. అదేరోజు అదే గదిలో నిద్రించిన మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. అయితే, వీరిద్దరూ చికిత్స అనంతరం కోలు కున్నా.. ఎందుకు అనా రోగ్యానికి గురయ్యారో స్పష్టత రాలేదు. తాజాగా అనిరుధ్ కడుపునొప్పితో చనిపోయాడు. గురువారం తరగతి గదుల వెనక రెండు పాములను చంపినట్లు విద్యార్థులు చెబుతున్నారు. శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పాఠశాలను సందర్శిస్తున్న సమయంలోనే ఓ పెద్ద పాము పొదల్లోకి దూరింది. టాయ్‌లెట్లు తరగతి గదులకు దూరంగా ఉన్నాయి.

వాటర్ ప్లాంట్ పని చేస్తుందా?

గురుకులంలోని మినరల్ వాటర్ ప్లాంట్ సరిగా పని చేస్తుందా అన్న అనుమానాలున్నాయి. కిచెన్‌లో కూరగాయలు, కోడిగుడ్లు కుళ్లిపోయి ఉండటం, ఎండు మిర్చికి బూజు పట్టింది. ఫుడ్‌సేఫ్టీ అధికారులు వచ్చి, శాంపిల్స్ సేకరించారు.

ఇప్పటికీ వైద్య సిబ్బందిని నియమించలే..

గణాధిత్య మృతికి కారణం ఫిట్స్ అని చెప్పినా పోస్టుమార్టంకు సంబంధించిన వివరాలు ఎవరూ స్పష్టంగా వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ విద్యార్థి చనిపోయి 15 రోజులు గడిచినా ఇప్పటికీ పాఠశాలలో వైద్య సిబ్బందిని నియమించలేదు. అనిరుధ్‌కు కడుపునొప్పి వచ్చిన సందర్భంలోనూ ముగ్గురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నా తమకు సమాచారం లేదని వారు చెప్పడం గమనార్హం. నిర్వాహకులు అప్రమత్తంగా ఉంటే ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు దక్కేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లేందుకు శుక్రవారం గురుకులానికి క్యూ కట్టారు. ఉపాధ్యాయులు, నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కొందరు విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు.

డీసీవో, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌లకు మెమోలు

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థుల మృతి ఘటనల్లో తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల జగిత్యాల జిల్లా కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.మహిపాల్‌రెడ్డిలకు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం మెమోలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గానూ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు ఇచ్చామని పేర్కొన్నారు.

సంతోషంగా చేర్పిస్తే.. విగతజీవిగా ఇంటికి

- పెద్దాపూర్ గురుకులానికి చెందిన మరో విద్యార్థి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/చందుర్తి(వేములవాడ): గురుకులంలో సీటు వస్తే తమ కుమారుడు పెద్ద చదువులు చదువుతాడని మురిసిపోయారు.. అతన్ని సంతోషంగా పాఠశాలలో చేర్పించారు.. ఎంతో భవిష్యత్తు ఉన్న కొడుకు విగతజీవిగా ఇంటికి రావడంతో ఆ కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులానికి చెందిన మరో విద్యార్థి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన ఎడమల కృష్ణారెడ్డి–ప్రియాంక దంపతులకు అనిరుధ్‌రెడ్డి(12) ఒక్కడే సంతానం. ఈ బాలుడు పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి కృష్ణారెడ్డి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా తల్లి ప్రియాంక ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని తల్లిగారింట్లో ఉంటోంది. ఉన్నట్టుండి అనిరుధ్‌రెడ్డి గురువారం కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి రాచర్లబొప్పాపూర్ తీసుకువచ్చారు. బాలుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి బయలుదేరాడు. ఆయన శనివారం ఉదయానికి రాచర్లబొప్పాపూర్ చేరుకుంటాడని, అనంతరం అనిరుధ్ రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.


అనిరుధ్ రెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కొలనూర్‌వాసిని క్షేమంగా ఇంటికి చేర్చండి

- ఇండియన్ ఎంబసీకి లేఖ రాసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం సౌదీ వెళ్లి, ఇబ్బందులు పడుతున్న కొలనూర్ యువకుడు మేరుగు అంజిని క్షేమంగా ఇంటికి చేర్చాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సౌదీలోని ఇండియన్ ఎంబసీకి లేఖ రాశారు. 'వేతనం ఇస్తలేరు.. అడిగితే కొడుతున్నరు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అంజి ఎక్కడున్నాడో కనిపెట్టి, సురక్షిత ప్రదేశంలో ఉంచాలన్నారు. పాస్‌పోర్టు, ఏటీఎం కార్డులు తీసుకొని, ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు కంపెనీపై విచారణ జరపాలని, అతన్ని త్వరగా ఇంటికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

సర్వీస్‌రూల్స్ సాధించాలి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): విద్యాశాఖలో ఎస్జీటీలకు కలిగిన నష్టాన్ని సరిచేయాలని, ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి కోరారు. తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో శుక్రవారం మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించలేదన్నారు. టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, శ్రీనివాస్, రాజు, మధుసూదన్, మిరాల వెంకటి పాల్గొన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్సీని అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు కోరారు. ముస్తాబాద్ మండలంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కొత్త పీఆర్సీని అమలు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, బదిలీలు పదోన్నతులు కల్పించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు శివశంకర్, బాలకిషన్, స్వామి, శంకర్, సత్యం, రాజేందర్‌రావు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

- పరారీలో మరొకరు
- మూడు కిలోల గంజాయి, రెండు ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్


అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం: ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేశామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లికి చెందిన క్రాంతి గంజాయికి అలవాటు పడ్డాడు. అంతేకాకుండా విక్రయించి, సొమ్ము చేసుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా గాయిదిగూడ మండలం రూపావాడకు చెందిన మాడవి దిగంబర్, తురమ్ అమత్‌రావులను గంజాయి తీసుకురమ్మన్నాడు. ఈ విషయమై పోలీసులకు పక్కా సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై సుధాకర్ తన సిబ్బందితో శుక్రవారం తంగళ్లపల్లి గ్రామ శివారుకు చేరుకున్నారు. అక్కడి అంబా టెంపుల్ వద్ద ఆ ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా 3 కిలోల గంజాయి లభ్యమైంది. విచారణలో తంగళ్లపల్లికి చెందిన క్రాంతికి విక్రయించేందుకు వచ్చామని, గతంలోనూ అతను కొనుగోలు చేశాడని తెలిపారు. దీంతో వారి వద్ద నుంచి గంజాయి, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేశారు. క్రాంతి పరారీలో ఉన్నాడు. జిల్లాలో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. గంజాయి సేవించినట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే డయల్ 100కు లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన పెంచలయ్య

వేములవాడఅర్బన్: జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పెంచలయ్య వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పెంచలయ్యను జిల్లా వైద్యాధికారి వసంతరావు, వైద్యులు సంతోష్‌చారి, అనిల్‌కుమార్, నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.

12న స్పాట్ అడ్మిషన్లు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తుది విడత వెబ్ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్లకు ఈనెల 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమాలో 8 సీట్లు, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 8, టెక్స్‌టైల్ టెక్నాలజీలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలీసెట్–24లో అర్హత పొందిన వారు.. ట్యూషన్ ఫీజు రూ.6వేలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 12న కాలేజీలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, విద్యారంగాన్ని రక్షించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ కోరారు. సిరిసిల్లలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ తరగతులకు దాదాపు వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, నాయకులు సాయి భరత్, శివ, ప్రభాస్, రవితేజ, హేమంత్, యశ్వంత్, మదన్ వాసవి, అక్షయ, అశ్విని పాల్గొన్నారు.


వైభవంగా నవచండీ హోమం

సిరిసిల్లటౌన్: హరిహరపుత్ర అయ్యప్ప ఆలయంలో శుక్రవారం నవచండీ హోమం నిర్వహించారు. రాజశ్యామల, శ్రీవారాహిసహిత బాలత్రిపుర సుందరి, శ్రీలక్ష్మీనారాయణ ఆలయాల తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గత వారం రోజులుగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చివరి రోజు శుక్రవారం నవచండీ హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాచ విద్యాసాగర్ గురుస్వామి నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన న్యాయవాదులు



సిరిసిల్లటౌన్: డీజీపీని బార్ అసోసియేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొండాల్‌రెడ్డి, సిరిసిల్ల న్యాయవాదులు శుక్రవారం కలిశారు. కోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేస్తున్న జిల్లా పోలీసుల తీరుకు నిరసనగా జిల్లా న్యాయవాదులు కోర్టు విధులు గత 9 రోజులుగా బహిష్కరిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ న్యాయవాదులు ఎస్.వసంతం, ఆవునూరి రమాకాంత్‌రావు, బొంపెల్లి రవీందర్‌రావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ ఉన్నారు.

మిడ్‌మానేరులో 17 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో శుక్రవారం నీటిమట్టం 17.15 టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లి నుంచి వరద కాల్వ మీదుగా ప్రాజెక్టులోకి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అనంతగిరి ప్యాకేజీ–10లోకి 6,400 క్యూసెక్కుల ఔట్ ఫ్లో వెళ్తోంది.

సరస్వతీదేవి విగ్రహ పునర్‌ప్రతిష్ట



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 1995–96 పదో తరగతి విద్యార్థులు చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం పునర్‌ప్రతిష్ఠించారు. చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నవేని రాజు, జనరల్ సెక్రెటరీ పాటి నరసింహులు, గౌరవ అధ్యక్షులు పెంజర్ల నారాయణ, బుగ్గ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఠాణాలో సంతకం చేసొస్తూ మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- 3 రోజులకు మూడపల్లి కల్వర్టు కింద మృతదేహం లభ్యం
- చందుర్తి మండలం జోగాపూర్‌లో విషాదం


వెంకటేశం (ఫైల్)

చందుర్తి(వేములవాడ): కండీషన్ బెయిల్‌పై ఉన్న ఓ యువకుడు ఠాణాలో సంతకం చేసొస్తూ మృత్యుఒడికి చేరాడు. మూడు రోజులకు అతని మృతదేహం లభ్యమవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలంలోని జోగాపూర్‌కు చెందిన బుర్ర వెంకటేశ్(28) నకిలీ స్టాంపు కేసులో జైలుకు వెళ్లి, ఇటీవలే కండీషన్ బెయిల్‌పై విడుదలయ్యాడు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేయడానికి బైక్‌పై వెళ్లాడు. చేశాక అక్కడి నుంచి స్వగ్రామం జోగాపూర్ వెళ్లి, కాసేపు స్నేహితులతో గడిపాడు. రాత్రి తిరిగి వట్టెంలకు వెళ్తూ మూడపల్లి శివారులోని కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనంతో సహా కల్వర్టు కింద పడి, మృతిచెందాడు. ఎవరూ గమనించకపోవడంతో విషయం తెలియలేదు.

అదృశ్యమయ్యాడని ఫిర్యాదు

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వెంకటేశ్ గురువారం ఉదయం వరకు వట్టెంలకు చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు తమ బంధువులు ఇళ్లలో, చుట్టుపక్కల వెతికారు. జోగాపూర్‌లో అతని స్నేహితులను వాకబు చేశారు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు

శుక్రవారం మూడపల్లి కల్వర్టు వైపు వెళ్లిన పలువురు గ్రామస్తులు వెంకటేశ్ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై బాపు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతని భార్య కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సీసీ ఫుటేజీల పరిశీలన

మరోవైపు వేములవాడ రూరల్ పోలీసులు వెంకటేశ్ కోసం వెతికారు. జోగాపూర్‌లో అతను ఎవరెవరిని కలిశాడన్న సమాచారం సేకరించారు. తర్వాత మర్రిగడ్డ గ్రామంలో సీసీ ఫుటేజీలను పరిశీలించగా బైక్‌పై వెంకటేశ్ ఒక్కడే వెళ్తున్నట్లు కనిపించింది. అనంతరం వేములవాడ పట్టణానికి మార్గమధ్యలో ఉన్న సీసీ ఫుటేజీల్లో అతను కనిపించలేదు. చివరకు మూడపల్లి కల్వర్టు కింద వెంకటేశ్ మృతదేహం, బైక్ కనిపించడంతో బుధవారం రాత్రి వర్షం పడిన సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.


మృతదేహాన్ని తరలిస్తున్న 108 సిబ్బంది

కేసు లేకుంటే గల్ఫ్ వెళ్లేవాడు..

కేసు పాలై ప్రాణాలు పోగొట్టుకుంటివా వెంకటేశ్.. అంటూ అతని కుటుంబసభ్యులు, బంధువులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. 8 నెలల క్రితం వెంకటేశ్ గల్ఫ్ నుంచి వచ్చాడని అతని స్నేహితులు తెలిపారు. జోగాపూర్‌లో ఇల్లు నిర్మించుకునే క్రమంలో బ్యాంకు రుణం తీసుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి పేరిట నకిలీ స్టాంపు తయారు చేయించాడని 4 నెలల క్రితం కేసు నమోదైందన్నారు. జైలుకు వెళ్లొచ్చాడని, కేసు లేకపోతే మళ్లీ గల్ఫ్ వెళ్లేవాడంటూ కన్నీరు పెట్టుకున్నారు.